క్లుప్తంగా

నేటి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ సర్వీస్

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 2వ తేదీ రాత్రి 08.30 గంటలకు త్రిపురాంతకం, యర్రగొండపాలెం మీదుగా హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ వరకు సూపర్‌లగ్జరీ సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. 3వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి 09.50 గంటలకు బయలుదేరి యర్రగొండపాలెం, త్రిపురాంతకం మీదుగా మార్కాపురం చేరుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఉర్దూ అరబిక్ సర్టిఫికెట్లు పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ముస్లిం నాయకులు

గిద్దలూరు రూరల్: అల్ మాదాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం బిలాల్ మసీద్ ఇమామ్ మౌలానా అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో ఉర్దూ అరబిక్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. బిలాల్ మసీదు ఆవరణలో గత రెండేళ్ల నుంచి ఉర్దూ అరబిక్ విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. ముస్లింలు అరబిక్ బాషలో ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం సంఘ నాయకులు నాయబ్‌రసూల్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వ్యసనానికి దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం రూరల్: గంజాయి, బెల్టుషాపులకు ప్రజలు దూరంగా ఉండాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు సూచించారు. ఆదివారం పట్టణ శివారులోని ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించాలని సూచించారు. లైసెన్సు లేకుండా వాహనాలు ఇవ్వవద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, వాట్సప్‌లో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలతో డీటీ

మార్కాపురం రూరల్: పట్టణ శివార్లలోని ఇందిరమ్మ కాలనీలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 6ఏ కేసు నమోదు చేసి బియ్యాన్ని గోడౌన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా రేషన్‌బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసినా, పెద్దమొత్తంలో కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉత్సవ విగ్రహాలుగా కియోస్క్‌లు!



బేస్తవారిపేట మండలంలో మూలనపడిన కియోస్క్ యంత్రం

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా యంత్రాలు
- కూటమి ప్రభుత్వ తీరుతో ప్రజాధనం వృథా
- సేవల నిలిపివేతపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- మార్కాపురం, గిద్దలూరు నియోజక వర్గాల్లో పనిచేయని 122 కియోస్క్‌లు

బేస్తవారిపేట: టెక్నాలజీకి తానే ఆద్యుడినని, సాంకేతికత వినియోగం మరింత పెరగాలని, ప్రపంచానికి ఏపీని డ్రోన్ హబ్‌గా మారుస్తామని, సెల్‌ఫోన్ కనిపెట్టింది నేనేనని.. ఇలా పదే పదే తన ప్రసంగాల్లో చెప్పే సీఎం చంద్రబాబునాయుడు.. రైతులకు చేరువైన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా మార్చారు. అవి రైతులకు ఉపయోగపడే యంత్రాలే అయినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారనే దుగ్ధతో వాటిని మూలన పడేలా చేశారు. ఇప్పటికే వ్యవసాయ రంగాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉచిత పంటల బీమా పథకాన్ని అటకెక్కించడం, పప్పుశనగ విత్తనాల సబ్సిడీకి కోత పెట్టి బయటి మార్కెట్‌కు మించి ధరలు ప్రకటించడం, రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలని చెబుతూనే అది కూడా కొన్ని పంటలకే పరిమితం చేయడంపై అన్నదాతలు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. గద్దెనెక్కి ఆరు నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీల్లో కనీసం ఒక్కటి కూడా అమలు చేయకపోవడం కూటమి సర్కారు తీరును తేటతెల్లం చేస్తోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా రైతు భరోసా కేంద్రాలు నెలకొల్పి రైతు వద్దకే అన్ని రకాల సేవలు అందజేసింది. వాటిలో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రాయితీతో సరఫరా అయ్యేవి. వాతావరణ మార్పులు, యాంత్రీకరణ, యాజమాన్య పద్ధతులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునే అవకాశం ఉండేది. అయితే ప్రస్తుతం అవి మూలకు చేరడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందలేదు. కొన్ని మండలాల్లో ఎరువులను ఆర్‌బీకేలకు తెప్పించడం, అమ్మడం శ్రమ, పని ఒత్తిడి అని వదిలేశారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఇండెంట్ పెట్టడం లేదు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. మార్కాపురం నియోజకవర్గంలో 57, గిద్దలూరు నియోజకవర్గంలో 65 రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. సేవా కేంద్రాలుగా పేరుకే మారాయి కానీ రైతుకు సేవలు అందడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని కియోస్క్‌లు సాంకేతిక కారణాలతో పని చేయడంలేదు. మరికొన్ని చోట్ల పూర్తిగా విస్మరించడంతో మూలకు చేరాయి. కియోస్క్ యంత్రాలను వాడుకలోకి తీసుకొచ్చి ప్రజాధనం నిరుపయోగంగా మారకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సూపర్ 6 పేరుతో కూటమి ప్రభుత్వం వంచన

- ట్రూ అప్ చార్జీలు రద్దు చేస్తామని చెప్పి ఇంత మోసమా?
- పెంచిన కరెంటు చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే

మార్కాపురం: కూటమి ప్రభుత్వం సూపర్ 6 పేరుతో 6 అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను వంచించి అధికారం చేజిక్కించుకుందని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. తాము అధికారంలోనికి రాగానే ట్రూ అప్ చార్జీలు ఎత్తివేస్తామని హామీ ఇచ్చి, ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని, సుమారు 15,485 కోట్ల రూపాయల భారాన్ని రాష్ట్ర ప్రజలు భరించాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన షూరిటీలు ఏమో కానీ.. ప్రజలపై పన్నుల బాదుడుకు గ్యారంటీ ఇచ్చారని ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ అధికారంలోనికి రాగానే ఎడాపెడా కరెంటు చార్జీల పెంపుతో వీర బాదుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. రాబోయే రోజుల్లో ఎన్నిసార్లు పెంచుతారో వేచిచూడాలన్నారు. ఒక వేళ గత ప్రభుత్వం తప్పిదాల వల్ల అని మీరు భావిస్తే వాటిని సరిదిద్ది ప్రజలపై భారం మోపకుండా ప్రభుత్వమే భరించవచ్చు కదా అని కూటమి సర్కారును ప్రశ్నించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలలో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే కార్యక్రమాన్ని మానుకోవాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఒక్కో స్మార్ట్ మీటరు ఖరీదు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటోందని, ఆ మొత్తాన్ని వినియోగదారుల వద్ద వాయిదాల పద్ధతిలో వసూలు చేయాలని చూడటం సరికాదన్నారు.

'వెలుగొండ'పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?



మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, ఎం.రమేష్ విమర్శించారు. ఆదివారం సీపీఎం పట్టణ పదవ మహాసభ స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో డడీకేఎం రఫీ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 28 ఏళ్లైనా ఇంతవరకూ పూర్తికాలేదని అన్నారు. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులతో కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారే తప్ప ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. వెలుగొండ కోసం రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. పశ్చిమ ప్రకాశం పూర్తిగా వెనుకబడిందని, ఈ ప్రాంత అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ జపం చేస్తోందన్నారు. జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జి.బాలనాగయ్య, పట్టణ కార్యదర్శి సోమయ్య, రూబెన్, రాజు, ఏనుగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సాయికిరణ్



బేస్తవారిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి ఫాదర్, నిర్వాహకులు

- డాక్టర్ సాయికిరణ్

మార్కాపురం: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ చాగంటి సాయికిరణ్‌రెడ్డి సూచించారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఆర్‌టీ సిబ్బందికి సూచించారు. అనైతిక శృంగారానికి దూరంగా ఉండాలని, ఎయిడ్స్ బాధితులకు ఉచితంగా మందులు అందిస్తున్న మందులు సక్రమంగా వాడాలని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనుమానితులు ఎవరైనా ఏఆర్‌టీ సెంటరుకు వచ్చి ఉచితంగా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని, వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సిబ్బంది టి.శ్రీనివాసులు, మురళీ, రామారావు, పోతురాజు, మహాలక్ష్మి, మహేశ్వరి, వాసుదేవరెడ్డి, ప్రత్యూష, వెంకటపతి, రాజు, ఎస్‌టీడీ సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా అంబేడ్కర్ కాలనీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, నివారణ ఒక్కటే మార్గమని, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫాదర్ జాన్ రంగయ్య పేర్కొన్నారు. రంగయ్య, చిట్టిబాబు, పాల్‌బాబు, ప్రత్విన్, కిషోర్ పాల్గొన్నారు.

మానవత సంస్థకు ఫ్రీజర్ బాక్సు అందజేత



మానవత ప్రతినిధులకు ఫ్రీజర్ బాక్సు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1986–87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మానవత స్వచ్ఛంద సంస్థకు సుమారు రూ.87 వేల విలువైన మార్చురీ ఫ్రీజర్ బాక్సు అందించారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సంస్థ జిల్లా కన్వీనరు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, పట్టణ అధ్యక్షుడు చలమారావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ సంఘం తరఫున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికే బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఆడియో సిస్టమ్ ఇచ్చినట్లు తెలిపారు. దాతలు కూడా చేయూతనివ్వాలని గుంటక వనజాక్షి కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పీవీ కృష్ణారావు, డాక్టర్ బాషా, నాగరాజు, తడికమళ్ల వెంకటరమణ, ఖాశీం, సుధాకర్, రామాంజనేయులు, హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌కేజే నరసింహం, ఓవీ వీరారెడ్డి, గంగిశెట్టి కిరణ్‌కుమార్, ఆంజనేయులు, తడికమళ్ల శ్రీనివాసరావు, ఎమ్‌ఆర్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి

తర్లుపాడు: స్థానికక హిందూ శ్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని సామాజిక కార్యకర్త జగన్‌బాబు కోరారు. గతంలో ఆర్య వైశ్య సంఘం ఆర్థిక సహకారంతో పలు వసతులు కల్పించామని, ప్రస్తుతం రేకులషెడ్డు, విద్యుత్ సరఫరా, గేటు తదితర పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని చెప్పారు. హిందువులు ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో సంజీవని అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందగా అంత్యక్రియలను ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్.నారాయణరెడ్డి, దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు లక్కు శరత్‌బాబు నిర్వహించారు. గత కొంత కాలంగా ఆశ్రమంలో ఉంటున్న కుక్కల దుగ్గిరెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. అనాథలు తమ ఆశ్రమంలో నిరభ్యంతరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. దాతల సహకారంతో అనాథాశ్రమం ముందుకు సాగుతుందన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి



డీఎం నరసింహులును సన్మానిస్తున్న పద్మశాలీలు

మార్కాపురం: పద్మశాలీలందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో పద్మశాలీ సంఘం నేతలు ఆయనను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థితికి చేర్చేందుకు కృషిచేయాలని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే నూతన కమిటీ ఏర్పాటుకు సంబంధించి ఎన్నికల కమిటీని నియమించినట్లు సభ్యులైన జి.రామాంజనేయులు, ఎ.నరసింహులు తెలిపారు. ఎన్నికల కమిటీలో తమతోపాటు శ్రీరామచంద్రమూర్తి, శంకర్, అనుముల రామయ్య, కె వెంకటస్వామి, ప్రగడా లక్ష్మయ్య, శ్రీనివాసులు, అనుముల కేశన్నలను నియమించినట్లు చెప్పారు.

పోటీ పరీక్షలపై అవగాహన అవసరం



మోడల్ ప్రశ్న పత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు పోటీ పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం బాలుర జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) డివిజన్ స్థాయి మోడల్ పరీక్షను స్కూల్ అసిస్టెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న వయసులోనే పోటీ పరీక్షల్లో పాల్గొంటే భవిష్యత్ పరీక్షలకు మార్గదర్శిగా ఉపకరిస్తుందన్నారు. మోడల్ పరీక్షకు సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పి.కోటిమోహన్, ఎస్ఎండీ రఫీ, డి.వెంకటేశ్వరరెడ్డి, యూసఫ్ షరీఫ్, వినోద్, మౌలాలి, విజయసారథి, శివప్రసాద్, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరావు, ఓంకార్, రామాంజనేయరెడ్డి, శ్రీను, నాగేశ్వరరావు, షుకూర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందువులు ఏకతాటిపై నడవాలి



మాట్లాడుతున్న ఉదయ్‌శంకర్

గిద్దలూరు రూరల్: హిందువులు ఐక్యమత్యంతో ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ అన్నారు. పట్టణంలోని వితా సుబ్బరత్నం కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హిందువుల సమ్మేళనం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హిందూ బహిరంగ సభకు హిందువులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నిర్వాహకులు బాలకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ఆసూలాల్, రామాంజనేయులు, బ్రహ్మానందరెడ్డి, మంత్రినాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో, కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణి కంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ, గౌరమ్మ నిమజ్జనం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెలరోజులపాటుగా గంగమ్మ, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కార్తీక మాసం ముగింపు సందర్భంగా విగ్రహ మూర్తులను కె.ఎస్.పల్లె సమీపంలో భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సగిలేరులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భీమలింగేశ్వరస్వామి ఆలయం వద్ద యాదవ వన భోజన మహోత్సవం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, యాదవ సంఘ నాయకులు ఒ. వెంకటయ్యయాదవ్, డాక్టర్ మొర్రి పిచ్చయ్యయాదవ్, నంద్యాల శ్రీనివాసులుయాదవ్, కొత్తకోట పోలయ్యయాదవ్, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా మహా లింగార్చన దీపోత్సవం



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని శివాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జగద్గురు ఆదిశంకరాచార్య బ్రహ్మణ పురోహిత అర్చక రుత్విక్కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహాలింగార్చన, బ్రహ్మణ సమారాధన ఘనంగా నిర్వహించారు. మార్కండేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, జగదాంబ అమ్మవారికి సాముహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. మహిళలు పూజ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జగదాంబ సమేత శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా జగదాంబ అమ్మవారికి అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదాంబ అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి 1116 నిమ్మకాయలతో అలంకరణతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో ఏకాహం

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ అనుమలవీడు శివాలయంలో ఆదివారం ఉదయం 7 నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు ఓం నమః శివాయ ఏకాహం నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పిడతల రామ్‌భూపాల్‌రెడ్డి, కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు భృగు మల్లేశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాల అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.